క్లుప్తంగా

ఆకలితో అలమటిస్తున్న గోవులు

గిద్దలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న గోవులను స్వాధీనం చేసుకుని ఇటీవల పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్న గోవులు ఆకలితో అలమటిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీన బీజేపీ నాయకులు పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ లారీ గోవులను అడ్డుకుని వాటను మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచారు. అప్పటి నుంచి అక్కడే ఉన్న 89 గోవులు ఆకలికి ఇబ్బందులు పడుతున్నాయని తెలిసింది. ఆ గోవుల మందలో 2 గోవులు మరణించాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోవులను సరైన దాణ, నీటి వసతి ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు తాడివారిపల్లిలో పశువైద్య శిబిరం

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశుగర్భకోశ చికిత్స శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. ఎదకు రాని, తిరగకట్టే పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

మీటర్ రీడర్ల కష్టాలు తొలగించాలి



డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న మీటర్ రీడర్లు

మార్కాపురం: డివిజన్‌లో పనిచేస్తున్న మీటర్ రీడర్ల కష్టాలు తొలగించాలని అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కే అన్వర్, పి.సతీష్ ఆధ్వర్యంలో విద్యుత్ డీఈ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. మీటర్ రీడర్లకు రెండు నెలలుగా వేతనం ఇవ్వడం లేదని, అలాగే గత 6 నెలల నుంచి ఈపీఎఫ్ కింద 500 నుంచి 1500 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. అందరికీ అరియర్స్ ఇవ్వాలని, వాటిని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగితీగ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వలో దుండగులు దుగ్గెపోగు సుగుణమ్మకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగితీగను అపహరించుకెళ్లారు. పంట పొలాలకు బోర్ల ద్వారా నీరు అందించేందుకు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



కారు తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

కొనకనమిట్ల: జాతీయ రాహదారిపై చినారికట్ల జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం ఎస్సై మాధవరావు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మండలంలోని జేబీకే పురంలో మంగళవారం పత్తి పంట సాగు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో పచ్చదోమ ఉండటాన్ని గమనించారు. దీని నివారణకు అసిటామిప్రిడ్ లేక ఇమిడాక్లోప్రిడ్ 0.2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కలుపు నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

భూమికి బలం..రైతుకు ఫలం!



పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట

- పచ్చిరొట్ట ఎరువుతో ఎన్నో ప్రయోజనాలు
- రైతులకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చులు

దొనకొండ: రైతన్నలకు నేడు సాగు అంటేనే ఖర్చుల భారం అన్నట్లు పరిస్థితి నెలకొంది. రైతులు రసాయనిక ఎరువులు వాడకాన్ని పెంచటంతో భూమిలో సారం పూర్తిగా తగ్గి పోతోంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగి పోతున్నాయి. దిగుబడులు కూడా తగ్గుతున్నాయి. రైతులు పచ్చి రొట్ట ఎరువు సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు పచ్చిరొట్ట సాగు చేసేందుకు ప్రభుత్వం రాయితీపై జీలుగలు, పిల్లి పెసర, జనుము విత్తనాలు అందజేశారు. ఎకరాకు 10 కేజీల చొప్పున పొలాల్లో చల్లి నెల రోజుల తర్వాత ఏపుగా పెరిగిన పచ్చిరొట్టను ట్రాక్టర్‌తో తొక్కించి భూమిలో కలిసేలా దుక్కి దున్నాలి. దీంతో పచ్చిరొట్ట కుళ్లి భూమిలో ఇంకిపోతుంది. వారం రోజుల తర్వాత గొర్రు, గుంటక, రోటావేటర్‌తో భూమి శుభ్ర పరిచి పంట సాగు చేసుకోవాలి. అలా చేస్తే రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. భూమిలో పోషకాల శాతం పెరుగుతుంది. అంతేకాకుండా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులకు పెట్టుబడుల భారం నుంచి కొద్దిమేర ఉపశమనం కలుగుతుంది. రైతులు ఈ పద్ధతిని పాటిస్తే నత్రజని, భాస్వరం, పొటాష్‌లు సేంద్రియ రూపంలో భూమిలో కలిసి పోతాయి. రైతులకు కొద్దిమేర ఉపశమనం, చైతన్యం కలిగి పచ్చిరొట్ట విత్తనాలను ప్రతి ఏడాది భూమిలో చల్లుకుంటారు. అంతేకాకుండా అధికంగా సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నేలను వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి:



రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగలు, జనుము విత్తనాలు అందిస్తున్నాం. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పచ్చిరొట్ట ఎరువులు వాడితే మొక్కలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు అందిస్తాయి. సూక్ష్మ జీవులు శాతం పెరుగుతుంది. మొక్కలు దృఢంగా ఉంటాయి.

– ఎస్.లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి

ఈ-పంట నమోదుతో రైతులకు ప్రయోజనాలు



పత్తి పొలంలో ఈ-క్రాప్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

దొనకొండ: రైతులు సాగు చేసిన పంటలకు ఈ-నమోదు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని గుడిపాడు, పెదన్నపాలెం రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ ఏడాది జియో రెఫరెన్స్ విధానంలో పొలం అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారని తెలిపారు. రైతులు వాస్తవంగా సాగు చేసిన పంటలను మాత్రమే ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఏ రోజు, ఏ సర్వే నంబర్లలో పంట నమోదు చేయబోతున్నారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలియజేయాలన్నారు. మండల రెవెన్యూ అధికారులను కలిసి ఆయా గ్రామాల్లో ఎంత మేర సాగు భూమి ఉందో, వ్యవసాయేతర పొలాలు అనగా ఇళ్ల ప్లాట్లు, బీడు భూములు, బంజర భూముల వివరాలు తెలుసుకోవాలన్నారు. గ్రామ సర్వేయర్లతో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి పంట నమోదు చేయాలని వ్యవసాయాధికారి ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది అరుణాదేవి, వీణా కుమారి, రైతులు పాల్గొన్నారు.

పనుల ఎంపికపై ప్రత్యేక దృష్టి ఉంచాలి



సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జనార్దన్

ముండ్లమూరు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల ఎంపిక కోసం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి పనుల ఎంపిక కోసం ప్రత్యేక గ్రామసభ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. గ్రామసభ నిర్వహణపై గ్రామస్తులకు ముందుగా తెలియజేసి పనుల ఎంపికలో భాగస్వాములను చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించడంతో పాటు పని చేసిన 15 రోజుల్లో నగదు అందేలా చూడాలన్నారు. ప్రధానంగా రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కోళ్ల ఫారం నిర్మాణం, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకం చేపట్టేలా చూడాలన్నారు. సమావేశంలో పశువైద్యాధికారి విజయలక్ష్మి, ఈఓఆర్డీ శ్రీదేవి, ఏపీఓ కె.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పరికరాల వితరణ



సైన్సు పరికరాలు అందజేస్తున్న అధికారులు

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సైన్సు ల్యాబ్ పరికరాలు, గ్రంథాలయ పుస్తకాలు వితరణ చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ప్రాజెక్టులో భాగంగా లక్ష రూపాయల విలువైన సైన్సు ల్యాబు పరికరాలు, గ్రంథాలయ పుస్తకాలు, బీరువా, టేబుల్స్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.కిషన్, ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.కిరణ్, ఎంఈఓలు వస్తంనాయక్, సుబ్బారావుల చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చా పూర్ణచంద్రరావు, ఎస్ఎంసీ చైర్మన్ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ అరుణకు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కేవీ పిచ్చయ్య

ముండ్లమూరు: మహిళా డాక్టర్లకు దేశంలో రక్షణ లేకుండా పోతోందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. మండలంలోని పోలవరం వద్ద వేదా ఫార్మసీ కళాశాలలో మంగళవారం డీవైఎఫ్ఐ-ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా డాక్టర్లకి రక్షణ కల్పించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యంత పాశవికంగా అత్యాచారం జరగడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకొచ్చి మహిళా డాక్టర్లకు అండగా నిలవాలన్నారు. డాక్టర్లకు రక్షణ కల్పించేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు సంస్థతో సమగ్రమైన విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్, సీఐటీయూ నాయకుడు బి.హనుమంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంది పంటపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని జమ్మిదోర్నాలలో మంగళవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొని కంది పంటలో విత్తనశుద్ధి గురించి రైతులకు వివరించారు. కిలో కంది విత్తనాలకు 10 గ్రాముల ట్రయకోడర్మావిరిడేతో విత్తనశుద్ధి చేసుకుని విత్తనాలను పొలంలో నాటుకోవాలని సూచించారు. దీంతో విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను, ఉప్పలం తెగులు రాకుండా ఉంటుందని, రైతులు తప్పని సరిగా ఈ పద్ధతిని పాటించాలని సూచించారు. వీఏఏం రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం



సభ్యత్వం అందజేస్తున్న ఆదిలక్ష్మి

పొదిలి: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు శాశ్వత సభ్యత్వ కార్డులు అందజేశారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య పది మంది విద్యార్థులకు తన సొంత డబ్బులతో సభ్యత్వం ఇప్పించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వం పొంది, ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. గ్రంథ పాలకుడు శ్యాంసన్ మాట్లాడుతూ.. గ్రంథాలయంలోని పుస్తకాలను ఉపయోగించుకుని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్ పాశ్చా, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

కొమరోలు: మండలంలోని రాజుపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు సీబీఎస్‌సీ సిలబస్‌లోని ట్యాబ్ బేస్డ్ అసైన్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ జిల్లాలో ట్యాబ్ బేస్డ్ అసైన్‌మెంట్ 63 పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ పరీక్షను ఈ పాఠశాలలో నిర్వహించామన్నారు. వీరి వెంట స్పెషల్ ఆఫీసర్ రోజ్‌సులోచన పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ అనిల్‌కుమార్



పెద్దారవీడు ఎస్ఐ అనిల్‌కుమార్

పెద్దారవీడు: పెద్దారవీడు పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్ఐ అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి పోలీసులు అభినందనలు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ



శతాధిక వృద్ధుడిని సన్మానిస్తున్న ఆదిలక్ష్మి

తాళ్లూరు (దర్శి): స్థానిక శాఖా గ్రంథాలయంలోని రికార్డులను మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పరిశీలించారు. వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో సభ్యులను పెంచాలని, సెస్ బకాయిలు వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. విశ్రాంత కలెక్టర్ పేరయ్య, వంద సంవత్సరాలు నిండిన పెండ్యాల వెంకటేశ్వర్లును కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఘనంగా సత్కరించారు. గ్రంథపాలకురాలు వి.విజయకుమారి, బీడీసీఎల్ బొద్దికూరపాడు నిర్వాహకురాలు వై.పద్మావతి పాల్గొన్నారు.

కళాశాలలో ఆర్ట్ ఎగ్జిబిషన్

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రగతి ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్ క్యాంప్, ఎగ్జిబిషన్ నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన చిత్రకారులు వేసిన చిత్రాలను ప్రదర్శనకు ఉంచగా విద్యార్థులు తిలకించారు. కళాశాల ప్రహరీపై జాతీయ నాయకుల చిత్రాలు వేశారు. అనంతరం కళాకారులను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఆర్ఐఓ సైమన్ విక్టర్, పీడీ మురళి, చిత్రకారులు ఖాసిం, రాజు, కోటి పాల్గొన్నారు.

నేతపాలెంలో వైద్య శిబిరం

పొదిలి: స్థానిక నేతపాలెంలో సీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శరత్ చంద్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. రక్తనమూనాలు సేకరించిన అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, ఎల్‌టీ పరశురామ్, ఏఎన్ఎంలు విజయ, రాణి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

ముండ్లమూరు: రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలకు సంబంధించిన వివరాలను ఈ-పంటనందు నమోదు చేయించుకోవాలని దర్శి ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని నాయుడుపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో సాగు చేసిన పలు రకాల పంటలను ఆయన మంగళవారం వ్యవసాయాధికారి ఫరూక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంట వివరాలను వచ్చే నెల 15వ తేదీ లోపు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. మొక్కజొన్న పంట బెట్టకు వచ్చే ప్రమాదముందన్నారు. అవకాశం ఉన్న రైతులు నీటి తడి అందించాలన్నారు. తెగుళ్ల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాన్నారు. ఆయన వెంట సిబ్బంది వీరాంజమ్మ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా వస్తువులు అందజేస్తున్న ప్రతినిధులు

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో క్రీడాకారులకు ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు వేల రూపాయల విలువైన క్రీడా వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎస్ఆర్ఐ ఎం.సంగీత, కుటుంబ సభ్యులు విద్యార్థులకు పలు రకాల క్రీడా వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కిరణ్‌చంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు.

మొక్కల సాంద్రత పెంచాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (దర్శి): మొక్కజొన్నలో మొక్కల సాంద్రత పాటించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు రైతులకు సూచించారు. మొక్కజొన్న పంటలో సాళ్ల మధ్య దూరం పాటిస్తూ మొక్క మొక్కకు మధ్యం కనీసం 20 సెంమీ పైబడి దూరం ఉండాలని, అంతకంటే ఎక్కువ ఉంటే కండె బలంగా రావటానికి అవకాశం తక్కువని తెలిపారు. కొత్తపాలెం, తాళ్లూరు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. మండలంలో ప్రస్తుతం 530 ఎకరాలుపై బడి మొక్కజొన్న విత్తారని, ఎక్కువగా భారతి 756, ఎస్‌హెచ్ఎం 007,589, శ్రీరామ 609, 33యం66, పిఏసి 751, విన్నర్, అడ్వాంటా, ఎల్‌జి, పయనీర్ హైబ్రిడ్ రకాలను రైతులు వేశారని ఆయన తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున పైర్లు బెట్టకు రాకుండా నీటి తడులు ఇవ్వాలని, మొక్కజొన్న ఏనుగు పంట గనుక బలం అందించాల్సిన అవసరం ఉందన్నారు. పంట కీలక దశల్లో పోషక లోపాలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని ఏఓ తెలిపారు. వీఏఏ నాయక్, రైతులు పాల్గొన్నారు.

చింతగుంట్లలో పశువైద్య శిబిరం

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్ల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో మంగళవారం పశుగర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ యోగానంద ప్రసాద్ మాట్లాడుతూ.. ఎదకురాని గేదెలను చూలుకట్టేలా చేసి ఏడాదికొక దూడ ఎలా పొందాలి, దూడల సంరక్షణపై పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓ డాక్టర్ రవికుమార్, మార్కాపురం సహాయ సంచాలకులు డాక్టర్ బాలూ నాయక్, కొండేపల్లి, గజ్జల కొండ, నంతరం పాడిరైతులకు మందులు పంపిణీ చేశారు.

గ్రామసభల బాధ్యత కార్యదర్శులదే



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సాయికుమార్

మార్కాపురం రూరల్: ఈనెల 23న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామ సభలను పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో నిర్వహించాలని డీఎల్‌డీఓ సాయికుమార్ పేర్కొన్నారు. సోమవారం మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 23వ తేదీన మండలంలో చేపట్టాల్సిన పనులపై చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తోట చందన, ఈఓఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ మోహన్‌రాజ్, పంచాయితీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

100 రోజుల్లో గృహ నిర్మాణాలకు కార్యాచరణ

కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా గృహ నిర్మాణాలపై ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. వీలైనంత త్వరగా ఇళ్లను పూర్తిచేయాలని ఆదేశించారు. లేఅవుట్లపై వివరణాత్మక సమీక్ష, ఇసుక ఆవశ్యకత, ఆర్థిక సమస్యలతోపాటు పలు అంశాలపై చర్చించారు.